# పోటి

ఉదయం పదకొండున్నర అయి ఉంటుంది. తెలుగు లెక్చరరు రాజమన్నారు క్లాసు నడుస్తోంది. అతను ఇన్ని సంవత్సరాలుగా ఆ కాలేజీలో ఉద్యోగం చేస్తున్నా పాఠాలు చెప్పడం ఇంత వరకు నేర్చుకోలేదు. పి. హెచ్.డి పూర్తి అయింది. ప్రొఫెసరు అయ్యాడంటే ఎంత మందికి గైడ్ అయి తను రాసిన కథల మీదో, తన వ్యాసాల మీదో, నవలల మీదో పరిశోధన చేయమని బలవంతం చేస్తాడో, ఏమో! అలాటివాడే.

తెలుగు బాగా చెబుతుంటాననే అభిప్రాయం అతనిలో బాగా పాతుకుపోవడం వలననుకుంటాను, కొమ్ములు మొలిచిఉండాలి. పాఠాలకన్నా పత్రికల్లో తను రాసిన కథల గురించి ఎక్కువగా క్లాసుల్లో చెప్పేవాడు. చెప్పినవే మళ్ళీ మళ్ళీ చెబుతుంటే ఎన్నిసార్లని వినడం? అతను చెప్పుకుంటూనే వెళ్తుంటాడు. కబుర్లు చెప్పుకునేవాళ్ళు చెప్పుకుంటూ ఉంటారు. గీతాటలు ఆడుకునేవాళ్ళు ఆడుతూ ఉండేవాళ్లు. అతని పాఠాల మీద నాకే మాత్రం ధ్యాస ఉండేదికాదు. లైబ్రరీ నుండి తెచ్చుకున్న పుస్తకాలు తీసి చదువుకుంటూ ఉండేవాడిని. నేను ఎవరి జోలికి వెళ్ళేవాడిని కాదు. నా జోలికి ఎవరూ వచ్చేవాళ్లుకాదు.

ఆ రోజు రాజమన్నారుకు ఏమయిందో, ఏమో నన్ను పేరెట్టి పిలిచి, "లేచి నుంచో" అన్నాడు.

అతనికి నా పేరు తెలుసని నాకు అప్పటివరకు తెలియదు. ఎవరూ ఎవరి గురించి పట్టించుకోరు. ఒక్కొక్కరు ఇద్దరు ముగ్గురుకు హాజరు పలుకుతుంటారు. విద్యార్థినులు కూడా అలాగే చేస్తూంటారు. లెక్చరరు చదివేది నెంబర్లే కాని పేర్లు కాకపోవడం వలన విద్యార్థినులు విద్యార్థులకూ హాజరు పలికిన సమయాలు లేకపోలేదు. ఇక్కడ చదువుకుంటూ బయట ఎక్కడో ఉద్యోగం చేసుకునేవాళ్ళు ఉన్నారు. నామటుకు నేను వెళ్ళేది కేవలం హాజరుకోసమే. క్లాసులో నిబంధన ఏమిటంటే నిద్రపోవచ్చు. గురకపెట్టి పక్క సీటులో నిద్రపోతున్న మరొకరి నిద్ర చెడగొట్ట కూడదు. క్లాసు గంట ఉంటుంది. క్లాసు క్లాసుకు గదులు మారుతుండాలి. మారుతున్నప్పుడు నిద్రపోతున్న వాళ్ళను ఎవరూ లేపరు.

బి.పి.కరుణాకర్

రాజమన్నారు నన్ను ఎందుకు నుంచోమంటున్నాడో నాకు అర్థం కాలేదు. తెలుగు క్లాసుకు బి.ఎ., బి.ఎస్.సి విద్యార్థులు, విద్యార్థినులు అన్ని సెక్షన్ల వాళ్ళు కలిపి ఎనభయి మందికి పయిగానే ఉంటారు. కూర్చొనే, "నేనా?" అడిగాను.

"నువ్వే" పెద్దగానే అన్నాడు.

తను చెప్పిన పాఠంలో ప్రశ్నలు వేస్తాడేమోనని అనుకున్నాను. వేసినా గాఢనిద్రలో ఉన్నానని చెబుదామని కూడా అనుకున్నాను. నాకు తెలిసి అతను క్లాసులో ఎవరినీ నుంచోమని అనలేదు. ఆ మాటకొస్తే మా కాలేజీలో అసలా పద్ధతే లేదు. గొడవ ఎందుకని లేచి నుంచున్నాను.

"బయటకు వెళ్ళు" అన్నాడు.

క్లాసురూం ఒక్కసారిగా నిశ్శబ్దమయింది. అక్కడక్కడా నిద్రపోతున్న వాళ్ళు క్లాసు అయిపోయిందని అనుకున్నారేమో ఉలిక్కిపడ్డట్టు మేల్కొన్నారు. ఇద్దరయితే, వాళ్ళకు నిద్రలో నడిచే అలవాటు ఉందేమో, లేచి నుంచుని పుస్తకాలు సర్దుకో సాగారు.

కొద్దిగా ఆశ్చర్యపోయినా, "ఎందుకు?" నిబ్బరంగా అడిగాను.

"పిల్లి కూత కూసినందుకు."

"సుందరరాజు పిల్లుల్ని తినడు. అంచాత పిల్లి కూతలు కూయడు." అన్నాడొక విద్యార్థి.

నా పేరు సుందరరాజు!

అందరూ ఘొల్లుమనీ నవ్వారు.

ఆ మాట అన్న విద్యార్థిని రాజమన్నారు ఏం అనలేదు. కనీసం వాడి వంకయినా చూడలేదు.

"మన క్లాసులో తిరిగే పిల్లి ఏమయింది?" ఒక విద్యార్థిని పెద్దగానే అంది.

నవ్వులతో గది నిండిపోయింది.

"పిల్లా, పిల్లినా?" అంది మరో అమ్మాయి.

మా క్లాసులో విద్యార్థుల కన్నా విద్యార్థినులే గడుగ్గాయిలు. వాళ్ళ నవ్వులే ఎక్కువ వినిపించాయి.

పాఠాలు చెబుతున్నప్పుడు ఒక పిల్లి అరుపులే కాదు, అన్ని రకాల జంతువుల అరుపులు అప్పుడప్పుడు వినడం మాకు అలవాటయిపోయింది. అమ్మాయిలు కూడా మగగొంతుకలు అనుకరించేవారు. జాలీగా గడిచిపోతుండేది. లెక్చరర్లు ఎవరూ సీరియస్‌గా తీసుకునేవాళ్లు కాదు. తెలుగు క్లాసులో కూడా గొడవ బాగానే జరుగుతుండేది. నాకు తెలిసి రాజమన్నారు మును పెన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. ఎక్కడో ఒకచోట గొడవలు ఆపాలని నిర్ణయించుకున్నాడేమో!

కాలేజీ జీవితం మళ్ళీ మళ్ళీ రాదు. ఏకత్వంలో భిన్న స్వరాలు తగులుతున్నా పట్టించుకోవలసినట్టు అనిపించదు. జీవితమంతా ఇంత ఆనందంగా గడిచిపోతే ఎంత బావుంటుందని అనిపిస్తూ ఉంటుంది. ఎవరు నవ్వినా కేంపస్‌లో పూలు పూసినట్టు ఉంటుంది. లెక్చరర్లు చివరకు ప్రిన్సిపాల్, ఎవరయినా మాలో ఏదో పెద్ద తప్పు చేస్తే తప్ప విద్యార్థులతో కలిసిపోతారు. మరి ఆ రోజు ఎందుకో రాజమన్నారు. మనిషి మనిషిలో ఉన్నట్టు అనిపించలేదు. శివాలెత్తుతూ, "నువ్వు బయటికు వెళ్తావా, లేదా?" అరిచినట్టుగా అన్నాడు.

అతనితో పోట్లాట పెట్టుకోవడం బావుండదనిపించి, క్లాసులోంచి వెళ్ళిపోదామని పుస్తకాలు సర్దుకుంటోంటే, "వెళ్తాడులే. దానికి అల్సేషన్‌లా అరవాలేమిటి?" ఎవరో అన్నారు. ఈ మాటకు అందరూ విరగబడి నవ్వుతోంటే నేనూ నవ్వుతూ క్లాసులోంచి బయటకు వచ్చాను.

జరిగినదంతా ముందు నాకూ నవ్వులాటగా అనిపించినా తర్వాత ఆ సంఘటన పదే పదే నా మనసులో కదులుతోంటే నేను చేయని తప్పుకు అవమానం పాలయినట్టు అనిపించింది. అది నవ్వులాట కాదు. అంత మందిలో ఎంతో స్తబ్దుగా ఉండే నేనే అతనికి దొరికానా? 'వీడు అమాయకుడు. నోరెత్తడు. ఎదురు తిరగడు' అనుకుని నన్ను ఎంచుకున్నాడా?

లంచ్ సమయంలో కేంటిన్‌లో కూర్చుని టీ తాగుతోంటే వెళ్ళి రాజమన్నారు పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని అతని చేయి గట్టిగా పట్టుకున్నాను. కప్పులోని టీ ఒలికి అతని చొక్కా ముందు జేబులో పడింది. ఆశ్చర్యపోతూ లేవబోయాడు. లేవనీయలేదు. రెండో చేత్తో అతని చేతిలో ఉన్న కప్పు అందుకుని బల్ల మీదపెట్టి, "క్లాసులో నన్ను అవమానించినందుకు నిన్ను తన్నడానికి రాలేదు. తన్నినా ఆడుకోడానికి

ఎవరూరారు. సాక్ష్యం చెప్పరు. నువ్వీ ఈ కాలేజీకి కొత్తవాడివి కావు, నీకు ఇక్కడి విషయాలు బాగా తెలుసు. క్లాసులో నేను నిన్నిలా పట్టుకుని తంతే తలొక తన్ను తన్నే వాళ్ళు... ముందీ మాటకు జవాబు చెప్పు. నన్ను క్లాసులోంచి ఎందుకు వెళ్లగొట్టావు?" మాటలు కరుకుగా ఉన్నా నెమ్మదిగానే అన్నాను. అంత ధైర్యం ఎలా వచ్చిందో నాకే తెలియదు. అతను అసలు ఊహించి ఉండడు. అతని ముఖం భయంతో బిగుసుకుపోతోంది.

"ఆ పిల్లి కూత.... " ఆగాడు.

"నేను వేయలేదు" పెద్దగానే అన్నాను.

కేంటిన్‌లో ఎక్కువ మంది లేరు. చేతి పట్టు మరింత బిగించాను. కాలేజీ నుండి సస్పెండయితే అయ్యాను కాని రాజమన్నారుతో అటో ఇటో తేల్చుకోవాలనే ఉంది.

"అవును, నువ్వు వేయలేదు."

"ఎవరు వేశారో నీకు తెలియదా?" నా కోపం మరింత గడ్డకడుతోంది.

"తెలుసు. రామకృష్ణారెడ్డి. అతన్ని క్లాసులోంచి వెళ్లగొట్ట లేక నిన్ను వెళ్లి పొమ్మన్నాను."

"ఇది రెడ్ల కాలేజీ కాదు కదా?"

అతను జవాబు చెప్పలేదు.

"స్టూడెంట్సు యూనియన్ ఆఫీసు బేరరూ కాదు. నీ రీసెర్చ్ అయిపోయింది. ఒక కాలు బయట పెట్టి ఏ యూనివర్సిటీలోకో వెళ్ళే ప్రయత్నాలు చేస్తూనే ఉండొచ్చు. మెల్లగా ప్రొఫెసరయి, డీన్‌గా ఎగబాకి, ఏ రాజకీయ ప్రాబల్యం వలనో వైస్ చాన్సలర్ అయ్యావంటే నీ న్యాయం ఇలానే ఉంటుందా?" అని అతని చేతిని వదిలేశాను.

ఈ సంఘటన జరిగిన చాలా సంవత్సరాలకు రాజమన్నారు ఎస్వీ యూనివర్సిటీకి ఒక టెన్యూరు వైస్ ఛాన్సలర్‌గా ఉన్నాడు. ఎందరి జీవితాలతో చెలగాటాలు ఆడుకుని ఉంటాడో?

* ఆదివారం వార్త, 28 మార్చి 2010